# అంచనా

కథా నిలయం శ్రీకాకుళం

రాచపూటి రమేష్

"కాబట్టి రత్తాలూ, నేను చెప్పే దొకటే. మీ అమ్మాయి బాగా చదివే పిల్ల. కాబట్టి వున్న పళంగా గౌరితో చదువు మానిపించి పెళ్లి చేయాలనుకోవడం చాలా మూర్ఖపు ఆలోచన. నా మాట విని గౌరిని డిగ్రీవరకైనా చదువుకోనీ, ఆ తరువాతే ఆ పిల్ల పెళ్లి గురించి తీరిగ్గా ఆలోచించవచ్చు" గట్టిగా చెప్పాను క్లాసు బయట నిలబడి నావంక కారాలు మిరియాలు నూరుతూ చూస్తున్న రత్తాలుతో.

రత్తాలు వెనుకే నిలబడి బిక్కుబిక్కుమని నా వంక చూస్తుంది గౌరి. క్లాస్‌రూంలో మిగతా అమ్మాయిలు మా సంభాషణ ఆసక్తిగా వింటున్నారు.

"నీకేం ఎన్నయినా సెప్తావు టీచరమ్మా. పద్మూడేళ్లు రాంగానే ఆడపిలకాయలకు పెళ్లిళ్లు సేసెయ్యడం మా ఇళ్లల్లో ఆచారం. సదువు, సట్టుబండలు అని లేటు సైడం మీ మాదిర్తో పెద్దోళ్లో ఇండ్లల్లో కుదుర్తుందేమో కాని మా అట్టాంటోళ్లింట్లో ఈలుపడదు" రత్తాలు చెప్పింది కోపంగా. ఆమె మాటలకడ్డుపడ్తూ "అమ్మా నాకిప్పుడే పెళ్లి ఒద్దే, నేను టీచరమ్మ మాదిర్తో సదూకుంటాను" అంది గౌరి దీనంగా.

"ఛత్.. నోర్మూయ్, నీకేం తెలుసు" అని ఆ పిల్లను గదమాయించింది రత్తాలు. గౌరి కళ్లల్లో నీళ్లు తిరగడం నాకు తెలుస్తూనే వుంది.

రత్తాలుది మూర్ఖపు పట్టుదల. కానీ ఆమెకు నచ్చజెప్పడం టీచరుగా నా బాధ్యత, ఒకసారి గొంతు సవరించుకొని చెప్పాను.

"చూడు రత్తాలూ... చదువు విలువ నీకు సరిగ్గా తెలియదు. మీ అమ్మాయి కూడా నీలాగే నాలుగిళ్లల్లో పాచిపని చేస్తూనో, లేకపోతే ఎర్రని ఎండలో ఇటుకలు మోస్తూనో బతకాలంటావా, లేకపోతే నీడపట్టున ఫ్యాన్ కింద కూర్చొని ఏ ఆఫీసులోనో, లేదా నాలా స్కూల్ టీచరుగానో వుంటూ నెల తిరిగేసరికల్లా మంచి జీతం తీసుకోవడం మంచిదంటావా?"

నా మాటలు రత్తాలుపై బాగానే పనిచేసినట్లున్నాయి. గడ్డం గీరుకుంటూ ఆలోచనలో పడింది.

"టీచరమ్మ చెప్పిందే కరెక్టు. నాకెప్పట్నుంచో రాధామేడంలాగా టీచరు కావాలనుంది" ఆత్రంగా చెప్పింది గౌరి.

"అది సరే టీచరమ్మా. మీకంటే వేలల్లో జీతాలు. పిలకాయలను బాగా సదివించుకుంటారు. మా కాడ ఏముండాది? ఇంట్లో జరిగేదే కట్టుగా వుంటే వేలు ఫీజులు పోసి ఎట్టా సదీపియ్యాల దీన్ని" సాలోచనగా అంది రత్తాలు.

రత్తాలు ఆలోచనా విధానం మూడు నాకు తృప్తినిచ్చింది. "ఆ సంగతి నాకొదిలెయ్. లక్కీగా మనకు మూడు మైళ్ళ దూరంలోనే సాంఘిక సంక్షేమ శాఖ వాళ్ల హాస్టలుంది. గౌరికెలాగూ తొమ్మిదో తరగతి పూర్తయింది. కాబట్టి టెంత్ క్లాస్‌కు హాస్టల్లో వేస్తే మీకు పైసా ఖర్చుండదు. పుస్తకాల ఖర్చు, భోజనాల ఖర్చు, ఫీజులు అన్నీ వాళ్ళే చూసుకుంటారు. నాలుగు రోజులకొకసారి మీరెళ్లి చూసి రావచ్చు" చెప్పాను ఆనందంగా.

నా మాటలకు రత్తాలు అడ్డు చెప్పదనిపించింది.

కానీ రత్తాలు మొఖంలో ఆనందపు ఛాయలు లేవు.

"ఆ ఆస్టల్లో మా అక్క కూతురు పాప చదవతా వుంది. ముందొక నాలుగైదు నెల్లు మన కర్సులంతా మనమే పెట్టుకోవాలంట. అదీగాక పుస్తకాలకు, ఫీజులకు వాళ్లిచ్చేది బోను మనకు సంవచ్చరానికి నాలుగైదు వేలైనా ఐతాదంట" అన్నది విచారవదనంతో.

నేను యోచనలో పడ్డాను. రత్తాలు చెప్పింది నిజమే, స్కాలర్‌షిప్ శాంక్షనయ్యేందుకు ముందు నాలుగు నెలల పాటైనా స్వంత ఖర్చులతో స్టూడెంట్ నెట్టుకు రావలసి వుంది. యూనిఫామ్‌లకు, బుక్స్‌కు, ఫీజులకు స్కాలర్‌షిప్ అమౌంట్ సరిపోదు. పైన మరో మూడు, నాలుగు వేలైనా ఖర్చవుతుందేమో. ఆ భారం మోసేందుకు రత్తాలు కుటుంబం సిద్ధంగా లేదు.

'గౌరి విషయంలో నేనిక చేయగలిగిందేమీ లేదు' అనుకుంటుండగా హఠాత్తుగా నాకు రాజేశ్వరి నాకిచ్చిన మాట గుర్తుకువచ్చింది.

"ఆ ఎక్స్‌ట్రా ఖర్చు విషయం నాకొదిలెయ్ రత్తాలు. నువ్వు దాని గురించి దిగులు పడాల్సిన పని లేదు" అన్నాను.

రత్తాలు ఆనందంగా గౌరిని తీసుకొని వెళ్లిపోయింది. మొఖంలో ఆనందం తాండవిస్తుండగా గౌరి నాకు నమస్కారం చేసి మరీ వెళ్లింది. ఇంతలో బెల్ కావడంతో పిల్లలందరూ పుస్తకాల బేగులు భుజాన తగిలించుకొని ఇళ్లకు బయల్దేరారు. ఇంటికి వెళ్లే దారిలో రాజేశ్వరి గురించి గుర్తుకు తెచ్చుకున్నాను నేను.

ooo


ఐదేళ్ల కిందటి మాట!

సెప్టెంబర్ 5వ తారీఖు గురు పూజా దీపోత్సవం నాడు నేను, నా కొలిగ్ నిర్మల స్కూల్లో ఫంక్షను ముగిశాక మా ఇంట్లో కూర్చుని కాఫీలు తాగుతూ ఫంక్షన్ తాలూకు ముచ్చట్లు నెమరేసుకుంటున్నాం.

ఇంతలో ఇంటి ముందు పొడవాటి కారాగింది. 'కార్లో మా ఇంటికొచ్చే బంధువులెవరున్నారా?' అని నేను కిటికీలోంచి చూశాను.

పట్టుచీరను సవరించుకుంటూ హుందాగా కార్లోంచి దిగుతున్న ముప్పై ఏళ్ల యువతెవరో నాకు ఎంతమాత్రం అర్థం కాలేదు. మరో డోర్ తీసుకుని సఫారీ సూట్‌లో వున్న పొడుగాటి బట్టతల యువకుడొకడు కారు దిగాడు. కంగారుగా మెయిన్ డోర్ వైపు వెళ్లాను.

ఆ యువతి ఎంత మాత్రం జంకూగొంకూ లేకుండా నేరుగా డోర్ తీసుకొని ఇంట్లోకి ప్రవేశించింది. చేతులు జోడించి చిరునవ్వు నవ్వుతూ "నమస్తే మేడమ్" అంది. ఆమె వెనుకే వచ్చిన యువకుడు మాత్రం తటపటాయిస్తున్నట్లు మెయిన్ డోర్



దగ్గరే ఆగిపోయాడు.

'ఆమెనింతకు ముందు ఎక్కడ చూశానో' అని డోలాయమాన స్థితిలో వున్న నాకు, "నన్నింకా గుర్తుపట్టలేదా మేడమ్" అని నవ్వుతూ ఆమె సంధించిన ప్రశ్న మరింత ఇబ్బందికరంగా పరిణమించింది. ఇంతలో యూనిఫామ్‌లో వున్న డ్రైవర్ ఒక చేతిలో కేరీబేగ్, మరో చేతిలో ఫ్లవర్ బొకేతో వచ్చి ఆ రెండు ఆమె చేతిలో వుంచి వెళ్ళిపోయాడు.

నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే పట్టుచీరలో వున్న యువతి ఫ్లవర్‌బొకేను నాకందిస్తూ "ఇక మిమ్మల్ని అట్టే సస్పెన్సులో వుంచను లేండి, పదహారేళ్ల క్రితం సెవెంత్ క్లాస్ చదువుతున్నప్పుడు నేను మీ స్టూడెంట్‌ను. నా పేరు రాజేశ్వరి" అంది.

అప్రయత్నంగా పుష్పగుచ్ఛాన్ని అందుకున్నాను. కానీ ఈ రాజేశ్వరి ఎవరో నాకు వెంటనే గుర్తుకు రాలేదు.

''కూర్చోవమ్మా, మీరు కూడా అలా కూర్చోండి బాబూ, ఇంకా నిలబడే వున్నారే" అన్నాను వచ్చిన వారిద్దరితో.

"మేడమ్ రాధగారు. నాకు విద్యాదానం చేసిన మహనీయురాలు. ఈయన మా వారండి" అని సఫారీ సూట్‌లోని వ్యక్తిని పరిచయం చేసింది. అతను వినయంగా నాకు నమస్కరించి ఛైర్లో కూర్చున్నాడు. నాకు అప్పుడే ఏదో మెరుపు మెరిసినట్లుగా రాజేశ్వరి గురించి జ్ఞాపకం వచ్చింది.




"నేను జాబ్‌లో చేరిన కొత్తలో ఓ రోజు... సెవెంత్ క్లాస్‌లో పాఠం చెప్పడం ముగించి స్టాఫ్ రూంలోకి వెళ్లాను. డైరీ రాద్దామని హేండ్‌బేగ్ తీసి చూసేసరికి అది కనిపించలేదు. ఇందాక క్లాస్‌లో వున్నప్పుడు ఏదో సమాచారంకోసం డైరీ తీసి చూసి, టేబుల్‌పై పెట్టినట్లు గుర్తొచ్చింది. బెల్ ఐన తరువాత హడావుడిగా స్టాఫ్‌రూంకొచ్చేశాను. గబగబా మళ్ళీ క్లాస్‌రూంకు వెళ్లాను. టేబుల్‌పై డైరీ అలాగే వుంది. దాన్ని తీసుకువస్తుండగా వెనుక బెంచీ లోంచి ఏదో శబ్దం వినిపించింది. ఆ పిరియడ్ లీజర్ కావడంతో పిల్లలందరు ప్లేగ్రౌండ్‌కు వెళ్లిపోయున్నారు. కానీ ఆఖరు బెంచిలో కూర్చొని యూనిఫామ్‌లో వున్న ఓ అమ్మాయి టేబుల్‌పై తల ఆనించి వెక్కి వెక్కి రోదించడం నాకు కనిపించింది. నేను గబగబా ఆ అమ్మాయి వద్దకు వెళ్లి ఆ పాప తలపై చేయి వేశాను.

ఉలిక్కిపడి లేచిన ఆ పాప కళ్లనిండా ఇంకా కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ఆ అమ్మాయిని బుజ్జగించి విషయం కనుక్కున్నాను.

ఆ పాప పేరు రాజేశ్వరి, సెవెంత్ క్లాస్ చదువుతూ వుంది. వాళ్లింట్లో చదివింది చాలని, ఇక

ఇంట్లోనే వుండి దినకూలీకి పూసల దండలు తయారు చేయమని బలవంతం చేస్తున్నారట. రాజేశ్వరి వాళ్ల నాన్న పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు అధిక సంతానం, తన చదువు కుటుంబానికి భారం కలిగిస్తున్నందుకు, ఇంట్లో చదువు మానేయమన్నందుకు తీవ్రమైన అశాంతితో బాధపడుతూవుంది రాజేశ్వరి.

రాజేశ్వరి ఆ క్లాస్‌లో మొదటి ఐదు రేంకులలో ఎప్పుడూ వుంటుందని నాకు తెలుసు. ఆ కారణంగా ఆమె చదువు చట్టుబండలు కావడం నాకెంత మాత్రం ఇష్టం లేకపోయింది.




“కళ్లు తుడుచుకో రాజేశ్వరి, నీ పుస్తకాలు, యూనిఫామ్ ఖర్చులన్నీ నేను చూసుకుంటానులే, మీ ఇంటికొచ్చి నీ చదువుకు బ్రేక్ ఇవ్వద్దని మీ వాళ్లకు చెప్తాను, పదా. ఇప్పుడే వెళ్తాం” అన్నాను. రాజేశ్వరి కళ్లల్లో కొత్త వెలుగు కన్పించింది.

రాజేశ్వరి తెలివైనదీ, బాగా చదివే స్టూడెంటనీ, అర్థాంతరంగా ఆ అమ్మాయి చదువు ఆపవద్దని వాళ్ల ఇంట్లో కన్విన్స్ చేయడం చాలా కష్టమైపోయింది. ఆమె ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్‌ల ఖర్చు తమపై మోపవద్దని కండిషన్ పెట్టారు వాళ్లింట్లో. సర్కారు బడి కాబట్టి ఫీజుల భారంలేదు. అప్పటికి నేనింకా అవివాహితను కాబట్టి రాజేశ్వరి చదువు ఖర్చులు భరించడం నాకేమీ భారం అనిపించలేదు. టెంత్‌క్లాస్‌లో స్కూల్ ఫస్ట్ వచ్చినప్పుడు రాజేశ్వరి నా కాళ్లకు నమస్కరించి, మెరిట్ స్కాలర్‌షిప్‌తో ఇంటర్లో సీటు వచ్చిందని చెప్పినప్పుడు చాలా సంతోషించాను.

ఇన్నాళ్లకు మళ్లీ రాజేశ్వరిని ఇలా కలుసుకోవడంతో నా ఆనందానికంతు లేకుండాపోయింది. కాఫీలు తాగాక పాత రోజుల ముచ్చట్లు చాలాసేపు చెప్పుకున్నాం. రాజేశ్వరి వద్దన్నా వినకుండా నాకు పట్టుచీర బహూకరించి ఆశీర్వాదం తీసుకొంది. ఎమ్మెస్సీ పాసై జూనియర్ లెక్చరర్‌గా పని చేస్తోందట. వాళ్ల ఆయన మదనపల్లెలో ఏదో ఫైనాన్స్ నడుపుతూ వున్నాడట. మదనపల్లె వచ్చినప్పుడు తప్పక వాళ్ల ఇంటికి రమ్మని అడ్రస్ ఇచ్చింది. అంతేగాక వెళ్లేముందు నాకొక వాగ్దానం చేసి మరీ వెళ్లింది.

“మేడమ్, సమయానికి మీరాదుకున్నారు కాబట్టే నేనింత చదువు చదివి ఈ రోజు మంచి పొజిషన్లో వున్నాను. మీకెప్పుడు ఏ సహాయం కావల్సివున్నా నా దగ్గరకు రండి, నాకు చేతనైనంతలో మీకు సాయపడ్తాను. అందుకెంత ఖర్చయినా నేను బాధపడను. మీ వంటి ఉత్తములు పరులకోసమే జీవిస్తారు. కాబట్టి మీకు సాయపడటం నా కర్తవ్యంగా భావిస్తాను నేను. అలాగైనా మీ ఋణం కొంత తీర్చుకుంటాను” అని చాలాసేపు చెప్పి భర్తతో పాటు వెళ్లిపోయింది.

ఇరవై ఏళ్ల క్రితం రాజేశ్వరి వున్న పొజిషన్లోనే ప్రస్తుతం గౌరి వుంది. కానీ అప్పటి సంగతి వేరు. పిల్లల చదువులు, బాధ్యతలు ప్రస్తుతం నాపై వున్నాయి. రాజేశ్వరికి సహాయపడినంత ఉదారంగా నా స్వంత డబ్బులతో గౌరికి సాయపడలేకుండా వున్నాను.

దశరథ మహారాజు తనకిచ్చిన వరాన్ని కైక అట్టిపెట్టుకొని సమయం చూసి కోరినట్లు, రాజేశ్వరి నాకు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకొనే సమయం ఆసన్నమైందని అనిపించింది నాకు. బీరువాలోని షెల్ఫ్‌లో రాజేశ్వరి అడ్రస్ వున్న కాగితం దొరికింది. వారం రోజుల్లో ఎలాగూ మదనపల్లెలో ఒక శుభకార్యానికి హాజరు కావలసి వుంది. అప్పుడే రాజేశ్వరి వాళ్ళింటికి వెళ్ళి, గౌరి చదువు విషయం మాట్లాడాలనుకున్నాను. రాజేశ్వరి నాకిచ్చిన మాటను తప్పక నిలబెట్టుకుంటుందన్న నమ్మకం నాకుంది.


○○○

ఇంటి చుట్టూ పెద్ద కాంపౌండ్ వాల్, పట్టుకుచ్చులాంటి లాన్‌లో రకరకాల పూల చెట్లు ఆ ఇంట్లోకి స్వాగతం పలుకుతూ, ఇంటి ఐశ్వర్య చిహ్నాలను తెలియజేస్తూ వున్నాయి. తోడుగా వచ్చిన మా తమ్ముడితో పాటు బెరుగ్గా ఇంట్లోకి అడుగుపెట్టాను. హాల్లోని కిటికీలు శుభ్రం చేస్తున్న పనివాడు గబగబా వచ్చి “ఎవరు కావాల?”ని అడిగాడు. రాజేశ్వరికోసం వచ్చినట్లు చెప్పాను.

పెద్దగా ఫర్నిచర్ లేకపోయినా హాలు మధ్యలో ఎర్రటి కార్పెట్ దానిపై నాలుగు పేము కుర్చీలు, టీపాయ్, తెరచి వున్న కర్టెన్ చాటు నుండి కనిపిస్తున్న చెక్క బీరువాల నిండా పుస్తకాలు. పనివాడు నన్నూ

## గడసరి నేహా జుల్కా

‘ఒక్కడున్నాడు’, ‘వియ్యాలవారి కయ్యాలు’ సినిమాల హీరోయిన్ నేహా జుల్కా తన కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లడానికి ఛార్మిని ఆదర్శంగా తీసుకుంటానంటోంది. ఛార్మి నటించిన ‘అనుకోకుండా ఒక రోజు’ లాంటి సినిమా చేయాలని వుంది అని చెబుతున్న నేహా జుల్కా- అందాల్ని ఆరేయడంలో అంతగా మొహమాటాలు లేవన్నట్టుగా పలుకుతుంది. కాస్త జనాల దృష్టిలోకి రావాలంటే ఆమాత్రం గ్లామర్‌ని తెరపై పంచాలి కదా అని కూడా అంటుందీ గడసరి నేహా.



తమ్ముణ్ణి కూర్చోమని ఇంట్లోకి వెళ్లాడు. 'ఇంట్లో ఇంకెవ్వరూ కనబడరే' అనుకున్నాను.

ట్రేలో రెండు మంచి నీళ్ల గ్లాసులతో వచ్చిందొక అమ్మాయి. "అమ్మగారు ఇంట్లో లేరండి" అంది.

నీళ్లు తాగుతూ గోడ గడియారంలో టైం చూసుకున్నాను. మరో అరగంటలో నాకు నెల్లూరుకు బస్సుంటుంది.

"నేనామెను అర్జంటుగా కలవాలి. కనీసం ఫోన్లోనైనా మాట్లాడాలి" అన్నాను. ఆ అమ్మాయి కాసా తటపటాయించి, లోపలికెళ్లి ఒక చిన్న స్లిప్‌లో ఓ ఫోన్ నెంబర్ రాసుకుని వచ్చి ఇచ్చింది. "ఈ నెంబరకు ఫోన్ చెయ్యండి. అమ్మగారితో మాట్లాడవచ్చు" అంది.

నా సెల్‌ఫోన్‌లో ఆ నెంబరు డయల్ చేశాను. ఎవరిదో ఆడగొంతు. నా వివరాలు ఫోన్లో చెప్పాను. రెండు క్షణాల తరువాత రాజేశ్వరి మాట్లాడింది. క్లుప్తంగా గౌరి గురించి వివరాలు చెప్పాను.

"మీరు నిశ్చింతగా బయల్దేరండి మేడమ్. గౌరికి కావలసిన సాయం నేను చేస్తాను" అంది రాజేశ్వరి. సంతృప్తితో బయల్దేరాను.

బస్సులో వెళ్తూ రాజేశ్వరి ప్రవర్తన గురించి ఆలోచించాను. పెద్ద ఇల్లు, ఇంట్లో ఇద్దరు పని వాళ్లు, పెద్ద వ్యాపారస్తుడైన భర్త, తన లెక్చరర్ ఉద్యోగం. ఆమె హోదాకేమీ తక్కువలేదు. కానీ ఇంటికొచ్చిన అతిథిని, అదీ ఆమె కష్టకాలంలో వున్నప్పుడు సరైన సాయంచేసి ఆమె కెరీర్ తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర వహించిన నాకు ఆ ఇంట్లో సరైన మర్యాద దొరకలేదనే అనిపించింది. 'కనీసం నేను వచ్చేవరకు ఇంట్లో వుండండనో' 'భోంచేసి వెళ్లండనో కర్టెసీకి కూడా అనలేదు రాజేశ్వరి' 'ఒక వేళ ఆమె బయట ముఖ్యమైన పనుల్లో వున్నా కానీ, కనీసం బస్టాండ్ దగ్గరకొచ్చైనా నన్ను వూరికి సాగనంపివుండవచ్చు గదా' అనుకున్నాను. 'ధనమదం బాగా తలకెక్కి వుందేమో, రాజేశ్వరి నా రిక్వెస్ట్‌ను గుర్తుంచుకొని తగిన సాయం చేస్తుందని' ఏ మాత్రం అనిపించలేదు నాకు. లేకపోతే ఎంతటి మిడిసిపాటు, ఎంత అహంకారం...

○○○

సరిగ్గా వారం రోజుల తరువాత రాజేశ్వరి పంపిన ముప్పై వేల రూపాయల చెక్ నాకందింది. ఆ డబ్బు సాయంతో గౌరితో టెంత్ క్లాసేకాక ఇంటర్ కూడా గట్టెక్కవచ్చుననుకున్నాను. కానీ రాజేశ్వరి సొమ్ము ఏపాటిది?

గౌరి ఆనందానికంతు లేదు. మంచి రోజు చూసుకొని నేను, రత్తాలు వెళ్లి గౌరిని పదవ తరగతి చదవడానికి హాస్టల్లో అడ్మిట్ చేసివచ్చాం.

రాజేశ్వరి ఇంటికెప్పుడు ఫోన్ చేసినా ఆమె ఇంట్లో లేదన్న సమాధానం వస్తూంది. సెల్లోనూ ఆమె దొరకడం లేదు. ఆమెకు కృతజ్ఞతలు చెప్పడం వీలుపడడంలేదు. తానైనా ఒకసారి నాకు ఫోన్ చెయ్యవచ్చు కదా. 'మరీ అంత అహంకారమా' అనుకున్నాను.

నెల రోజుల తరువాత హఠాత్తుగా ఓ సాయంత్రం నా పాత కోలీగ్ నిర్మల వూడి పడింది. భర్త ఉద్యోగరీత్యా ఆమె అనంతపురానికి ట్రాన్స్‌ఫర్ చేసుకొని పదేళ్లు దాటింది. ఇంతకాలం తరువాత ఆమెను చూసేసరికి నా ఆనందానికంతు లేదు. నెల్లూరులో ఎంసెట్ కోచింగ్‌లో వాళ్ళబ్బాయిని చేర్చేందుకు వచ్చిందట.

ఫలహారం తిన్న తరువాత కాఫీ తాగుతూ చెప్పింది నిర్మల. "అన్నట్లు చెప్పడం మరచాను. మా చిన్నాన్నగారికీ మధ్య ఆంజియోప్లాస్టీ జరిగితే చూడడానికి మదనపల్లె వెళ్లాను. ఆయన అడ్మిటైన నర్సింగ్ హోంలోనే నీ ఒకప్పటి స్టూడెంట్ రాజేశ్వరి కూడా వుంది. పాపం ఆమె పరిస్థితి చాలా క్రిటికల్‌గా వుంది" విచారంగా అంది.

నా కాళ్లకింద భూమి కదిలినట్లైంది. 'రాజేశ్వరికేమైంది?' అదే విషయం అడిగాను నిర్మలను.

"ఆమె గ్రహస్థితి ఏమీ బాగున్నట్లు లేదు. కిడ్నీ ఫెయిల్యూర్, రెండు కిడ్నీలు పాడయ్యాయట. నాలుగు నెలల నుండి రెగ్యులర్‌గా డయాలసిస్ చేసుకుంటూ వుందట. ఆమెతోబాటు వున్న ఆమె పిన్ని చెప్పింది.

వాళ్లాయన చేస్తున్న ఫైనాన్స్ బిజినెస్ పూర్తిగా దెబ్బ తిన్నదట. ఇద్దరు పార్ట్‌నర్స్ ఆయన్ను మోసం చేసి అప్పుల్లోకి నెట్టి పారిపోయారు. అప్పుల వాళ్లకు వున్న ఇల్లు, ఆస్తులు మొత్తం స్వాధీనం చెయ్యాల్సివచ్చిందట. పదిరోజుల క్రితమే వాళ్లా ఇంటిని స్వాధీనపరచుకున్నారు.

రాజేశ్వరి వాళ్లాయన షాక్‌కు తట్టుకోలేక రెండు నెలల క్రితమే ఎక్కడో వెళ్ళిపోయాడట. ఇంట్లో వున్న పనివాళ్లను మాత్రం తన చివరి రోజులవరకు జీతమిచ్చి పోషించిందట రాజేశ్వరి" అంది నిర్మల భారంగా.

"అంటే రాజేశ్వరి..." ఆదుర్దాగా అడిగాను.

"డయాలసిస్ అంటే మాటలు కాదు కదా, చాలా ఖర్చవుతుంది. తన గాజులమ్మి ముప్పై వేలు అకౌంట్‌లో వేయమని ఆమె పిన్నితో చెప్పిందట. ఆ డబ్బే వుంటే మరో రెండు, మూడు నెలలైనా బతికేదని అందామె పిన్ని...." నిర్మల ఏదో చెబుతోంది. నాకేమీ చెవికెక్కడం లేదు.

అఖరు క్షణాల్లో కూడా ఇచ్చిన మాట కోసం తనకు మిగిలిన సర్వస్వాన్ని త్యాగం చేసిన మహోన్నతురాలు రాజేశ్వరి. నేను బాధపడతానని ఇవన్నీ నాకు తెలియనివ్వలేదు. ఆమెనెంత తక్కువగా అంచనా వేశాను. అశ్రునయనాలతో రాజేశ్వరికి అంజలి ఘటించాను.

○

## నాజూకు తనుశ్రీ

ఈమధ్య తనుశ్రీ దత్తా కూడా బాగా లావైపోవడంతో నిర్మాతలు ఆమెని పెట్టి సినిమాలు తీయడానికి కాస్త ఆలోచిస్తున్నారట. దాంతో త్వరగా మేలుకున్న తనుశ్రీ స్లిమ్మింగ్ ప్రోగ్రాం పెట్టుకుందిట. డైటింగ్‌లూ గత్రాలతో లాభం లేదనుకుని, వెంటనే అమెరికా చెక్కేసిందిట. అక్కడి ట్రీట్‌మెంట్‌తో నాజూగ్గా తయారై తిరిగి ముంబాయి చేరుకుంటుందిట. లావయేందుకు అంతగా ఖర్చులేకపోయినా సన్నబడేందుకు మాత్రం బోల్డంత ఖర్చే మరి! అఫ్ కోర్స్ ఆ తర్వాత సినిమా చాన్సులొస్తే బానే గిట్టుబాటవుతుంది కదా!

